
# హైదరాబాద్ వార్త



## లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన మీర్‌పేట్ ఎస్ఐ



రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మీర్‌పేట్ ఎస్ఐ సైదులు

సరూర్‌నగర్, మార్చి 30 ప్రభాతవార్త: లంచం తీసుకుంటూ ఓ ఎస్ఐ ఎసిబికి చిక్కాడు. సివిల్ కేసులో తలదూర్చడమే కాకుండా బాధితులను బెదిరించి సెటిల్మెంట్ చేసే ప్రయత్నంలో రూ.10 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులకు తాను పని చేస్తున్న పిఎస్‌లోనే పట్టుబడ్డాడు. ఈ సంఘటన హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గుర్రంగూడకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే మాదాని సుభాష్‌కు నాదర్‌గుల్‌కు చెందిన నజీముద్దీన్ తన 200 గజాల స్థలాన్ని రూ.4.80 లక్షలకు అమ్మడానికి అగ్రిమెంట్ చేశాడు. అయితే వివాదంతో ఉన్న సదరు ప్లాటు వ్యవహారం కోర్టులో అనుకూలంగా వచ్చే అవకాశం ఉండడంతో నజీముద్దీన్ తను ప్లాటును తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి తేగా సుభాష్ ఒప్పుకోలేదు. దీంతో నజీముద్దీన్ ఈ విషయాన్ని మీర్‌పేట్ పిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో సివిల్ కేసులో తలదూర్చిన ఎస్ఐ సైదులు ఈ కేసును సెటిల్మెంట్ చేయడానికి ప్రయత్నించి సుభాష్‌ను బెదిరించి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. అయితే ఈ వ్యవహారమై ఎసిబికి ఫిర్యాదు అందింది. దీంతో ఎసిబి అధికారులు రంగంలో దిగారు. ఈ నేపథ్యంలో శనివారం సుభాష్ రూ.10 వేల లంచం ఎస్ఐ సైదులకు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్ఐ స్వయం డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో ఎస్ఐను అదుపులోకి తీసుకున్నారు.




సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి చలో ఢిల్లీకి బయలు దేరిన ఆప్ కార్యకర్తలు

## చలో ఢిల్లీ ప్రదర్శనకు ఆప్ కార్యకర్తలు

సైఫాబాద్, మార్చి 30 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు నిరసనగా ఈ నెల 31న ఆదివారం 'చలో ఢిల్లీ ప్రదర్శన'కు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు శనివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌నుంచి బయలు దేరి వెళ్ళారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ నేతృత్వంలో కార్యకర్తలు ఈ ప్రదర్శనకు బయలు దేరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటనలో ముగ్గురి అరెస్టు

### పరారీలో ఇద్దరు: డిసిపి రోహిణి ప్రియదర్శిని



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర మండలం డిసిపి రోహిణి ప్రియదర్శిని

కంటోన్మెంట్, మార్చి 30 ప్రభాతవార్త: లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో రెండు కుటుంబాలను చిదిమేసిన ఘటనలో ఐదుగురిపై కేసులు నమోదు చేయగా, ముగ్గురి వ్యక్తులను అరెస్టు చేయగా రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఉత్తర మండలం డిసిపి రోహిణి ప్రియదర్శిని, ట్రాఫిక్ అడిషనల్ డిసిపి సుబ్బారాయుడులు తెలిపారు. శనివారం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన రాత్రి బోయిన్‌పల్లి జాతీయ రహదారి, మిలటరీ డైయిరీఫాం సమీపంలో భారత్ ఫైబకర్ కేబుల్‌కు సంబంధించిన వైర్లు కింద పడిపోవడంతో వైర్లను తొలగించడానికి వాహనాలను ఆపడం లేదు. అదే ప్రాంతంలో జరుగుతున్న ఫ్లైఓవర్, స్కై వే నిర్మాణం పనుల్లో భాగంగా నిర్మాణ సంస్థ ఎలాంటి రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులనుఏర్పాటు చేయకపోవడంతో సుచిత్ర నుంచిబోయిన్‌పల్లి నుంచి వేగంగా వస్తున్న లారీ ముందు ఉన్నా వాహనాలను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే ఇద్దరు మృత్యువాత పడగా మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలైయ్యాడు. ప్రమాదానికి గురి చేసిన డ్రైవర్‌ను మార్చి కేసు నుండి తప్పించే ప్రయత్నం చేయడంలో లారీ యజమాని కూడా కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. పశ్చిమ బెంగాళ్‌కు చెందిన లారీ డ్రైవర్ ఉర్జిషేక్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరగడం వల్ల రెండు వేర్వేర్ కుటుంబాల్లో మృత్యువాత పడ్డారు. లారీ ఫిట్‌నెస్ లేక పోవడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. మిగతా సిటీ 3వ పేజీలో


## డిస్కౌంట్‌లో ఐపిఎల్ టికెట్లు అంటూ మోసం

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం వేదికగా ఏప్రిల్ 5న సన్‌రైజర్స్ హైదరాబాద్ -చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్ జరగనుంది. అయితే ఈక్రేజీ మ్యాచ్‌కోసం ఇప్పటికే హాట్‌కేకుల్లా టికెట్లు అమ్ముడుపోతున్నాయి. దీంతో చాలామంది అభిమానులకు టికెట్లు దొరక్కపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈనేపథ్యంలో ఇదే అదునుగా చేసుకున్న సైబర్‌నేరగాళ్లు అభిమానులను ఆశను దోచుకునే పనిలోపడ్డారు. ఈనేపథ్యంలో సోషల్‌మీడియాలో ఐపిఎల్ టికెట్ల విక్రయం పేరుతో కొన్ని ప్రత్యేక పేజీలను ఏర్పాటు చేశారు. ఈపేజీలద్వారా టికెట్లు కావాలంటూ సంప్రదించాల్సిన కొన్ని వాట్సాప్‌నెంబరన్లను సైతం అందులో ప్రచురించారు. ఇది నిజమేనని నమ్మిన అభిమానులు ఆవాట్సాప్‌నెంబర్‌తో చాట్ చేస్తున్నారు. అలాగే క్యూర్‌కోడ్ ఏర్పాటుచేసి దాని ద్వారా డబ్బులు పంపించమని సైబర్‌నేరగాళ్లు అడుడుతున్నారు. దీంతో అనుమానం వచ్చిన హెచ్‌ఎప పోలీసులకు కంప్లైంట్ చేయగా అది ఫేక్ అని తేలింది.

## వలస నేతలకు న్యాయం జరిగేనా?



- గేట్లు ఎత్తిన కాంగ్రెస్‌లోకి గుంపులుగా బిఆర్ఎస్ నేతలు
- వలస పోయే నాయకులకు కాంగ్రెస్‌లో ఏం జరుగబోతుంది?




- క్షేత్రస్థాయి బిఆర్ఎస్ క్యాడర్‌లో అసహనం
- నాడు టిక్కెట్టు కోసం ప్రగతి భవన్‌కు క్యూ కట్టిన నేతలు.. నేడు పోటీ చేయడానికే నసేమిరా!
- కష్టకాలంలో పార్టీని వదిలి వెళ్లిపోతున్న నేతలు

ముందు నుంచి ఉన్నవారిని.. పార్టీ కష్టకాలంలో జెండామోసి.. జీవితాలను సైతం త్యాగంచేసిన వారిని కాదని.. కొత్తవారికి పార్టీలో అతిప్రాధాన్యత కల్పించి.. అందలం ఎక్కించి తాము ఏంచేసినా తిరుగులేదు అని ఆహంభావంతో విర్రవీగితే చివరికి ఏం జరిగింది.. ఏం జరుగుబోతుంది అనేది భవిష్యత్తు చూపిస్తోంది. అపరచాణక్య ప్రతిభకు అన్ని సందర్భాలు కలిసివస్తాయనుకోవడం సరైందికాదనిపిస్తోంది. అధికారం చేతిలో ఉన్నప్పుడు అనుకున్నట్టే జరుగుతాయి. కానీ ఏమాత్రం బెడిసికొట్టినా.. ఇక అథః పాతానికే.. ఆథాళ పాతం నుంచి.. అందలంసైతం అందిపుచ్చుకోవచ్చు.. అందలం నుంచి ఆథాళ పాతంలోకి వెళ్తే.. ఇక ముందు మళ్లీ వెళ్లడం అనేది అసంభవమే.. చివరికి చేతులు కాల్చుకున్న బిఆర్ఎస్ అధినేత.. ఇప్పుడు పార్టీని గాడిలో పెట్టడం అంతా ఈజీ ఏమీ కాదు.

నాడు అలా నేడు ఇలా

నాడు కెసిఆర్ తీరునే.. నేడు కాంగ్రెస్ చేస్తోంది. వలసను ప్రోత్సహిస్తోంది.

తెలంగాణ ఉద్యమ సమయంలో **2004**లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పటి టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను కెసిఆర్ లాగే చేశాడు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తెలంగాణ రాష్ట్రంలో **2014**లో అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ పార్టీ వైఎస్ రాజశేఖరరెడ్డి విధానాలనే అవలంభించింది. ఇప్పుడు మళ్లీ అదే పని కాంగ్రెస్ చేస్తోంది. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు ప్రజల్లో చైతన్యం, సరికొత్త ఆలోచన విధానాలనేవి పురుడుపోసుకోవాలి. ప్రజాస్వామ్య పరిరక్ష బాధ్యతలు స్వీకరించాలి.

హైదరాబాద్, మార్చి 30 ప్రభాతవార్త: ఒకే ఒక్క ఓటమితో వడదెబ్బ తగిలిన గులాబీలా వాడిపోయింది. గేట్లు ఎత్తిన కాంగ్రెస్‌లోకి గుంపులుగా బిఆర్ఎస్ నేతలు చేరిపోతున్నారు. దీంతో అంతర్మధనం మొదులుపెట్టారు గులాబి నేతలు అధికారం కోసం వచ్చిన నేతల స్థానంలో నిఖార్సైన నాయకులను తయారు చేస్తామంటున్నారు. మరి అది సాధ్యమేనా? జెండా మోసిన అసలు నేతలకు ఇప్పటికైనా అవకాశం లభిస్తుందా? ఇది ఇప్పుడు నగరవ్యాప్తంగా సాగుతున్న చర్చ.



అప్పటి ఉద్యమ పార్టీ నుంచి ఇప్పుడు ఉద్యమంలా వలసలు కొనసాగుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు వెల్లువలా తరలివచ్చిన నేతలు అధికారం పోగానే అంతే వేగంగా కారు దిగేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు మొదలుకుని కిందిస్థాయి నేతలు సైతం గులాబి పార్టీని వీడి హస్తం గూటికి చేరుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుంచి బరిలో నిలిపేందుకు అభ్యర్థులు సైతం కరువైన పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు బిఆర్ఎస్ టికెట్ అంటే యమ క్రేజ్. పార్టీ టికెట్ ఇస్తే చాలు. గెలుపు ఖాయమనే ధీమా.. కాని 2023లో ఎన్నికలు జరగడం, బిఆర్ఎస్ రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవడంతో ఆపార్టీ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గతంలో టికెట్ల కోసం ప్రగతిభవన్, తెలంగాణభవన్ చుట్టూ క్యూకట్టే పరిస్థితి ఉంటే.. ఇప్పుడు టికెట్ దక్కిన నేతలు సైతం పార్టీ తరపున పోటీ చేయలేమంటూ చేతులు ఎత్తేస్తున్న పరిస్థితి. అసలు ఈ పరిస్థితి ఎందుకొచ్చిందనే దానిపై నగరంలో జరుగుతున్నది ఒకే ఒక్క చర్చ. ప్రత్యేక రాష్ట్ర సాధనలో అప్పటి నుంచి టిఆర్ఎస్ ప్రస్థానంలో జెండా పట్టినవాళ్లకు కాకుండా.. జెండా నీడన సేదదీరేందుకు వచ్చిన వాళ్లకే ఎక్కువ అవకాశం ఇచ్చిందన్నదీ కేడర్ వాదన. క్షేత్రస్థాయిలో పార్టీకి అండగా ఉన్న వాళ్లకు పదేళ్లపాటు అన్యాయం జరిగిందనే అనేక మంది నేతలు బహిరంగంగానే విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాక సమీక్షల్లో 80 శాతం కేడర్ ఇది అభిప్రాయం వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం ఈ మాటలను పెద్ద గా పట్టించుకోని అధిష్టానానికి ఇప్పుడు మెల్లగా తత్వం బోధపడుతోంది. అందుకే ఇకపై నిఖార్సైన కొత్తతరం నాయకత్వాన్ని సిద్ధం చేస్తామని చెబుతున్నారు ఆపార్టీ అగ్రనేతలు.

'బంగారు తెలంగాణ అభివృద్ధి' పేరుతో పార్టీలోకి వచ్చీరాగానే కొందరు నేతలకు ముఖ్యమైన పదవులు కట్టబెట్టింది బిఆర్ఎస్ పార్టీ. కానీ కష్టంలో ఉన్నప్పుడు వాళ్లు వదిలి వెళ్లిపోవడం చేసి జీర్ణించుకోడానికి ఇబ్బంది పడుతోంది. పూటకో ఘటన. రోజుకో వలస కళ్ల ముందు కనిపిస్తుంటే..నాలుగు నెలల క్రితం కేడర్ చెప్పిన మాటలను నెమరవేసుకోక తప్పడం లేదు. అందుకే పోనీ పోనీ పోత పోనీ అన్నట్లు.. అగ్రనేతలు మానసికంగా సిద్ధమైపోయారు. రియలైజ్ అయ్యారో ఏమోగానీ.. ఇకనైనా నిఖార్సైన నేతలను తయారుచేసుకుంటాం అంటున్నారు పార్టీ లీడర్స్, అధికారంలో ఉన్న పదేళ్ల పాటు తెలంగాణ రాజకీయాలను కంటిచూపుతో శాసించిన బిఆర్ఎస్. కానీ ఒక్క ఓటమి.. ఆ పార్టీ పరిస్థితిని తలకిందులు చేసే సింది. పదేళ్లపాటు అధికారం అనుభవించిన నేతలు. కష్టకాలంలో నిర్ధాక్షణ్యంగా వదిలివెళ్లిపోతున్నారు. అయితేనేం. ఎన్నో ఒడిదొడుకులు చూసిన హైకమాండ్ మళ్లీ మొదలుపెడతాం అన్నట్లుగా ధీమాగా ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు పరిస్థితి ఉంటే ఉండొచ్చు గానీ.. ఇప్పటికైనా జెండా మోసిన వాళ్లకు న్యాయం జరగాలన్నది పార్టీ శ్రేణుల ఆకాంక్ష.

## అయోమయంలో దానం!

### ఎమ్మెల్యేకు రాజీనామా చేస్తేనే.. ఎంపీకి చాన్స్?

### ససేమిరా అంటే.. ప్రత్యామ్నాయంగా బొంతు రామ్మోహన్‌కు అవకాశం



హైదరాబాద్, మార్చి 30 ప్రభాతవార్త: ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే దానం నాగేందర్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలని ఏఐసీసీ నిర్ణయించినట్లు సమాచారం. బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం సాధ్యం కాదని పార్టీ అధిష్టానం పెద్దలు తేల్చినట్లు తెలుస్తోంది. ఈనెల 17న బిఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేయాలన్న శరతులతో ఆయనకు సికింద్రాబాద్ ఎంపి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీకి వెళ్లిన దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, సికింద్రాబాద్ ఎంపీ బరిలో నిలుస్తారా లేక ఆ ప్లేస్‌లో గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పోటీ చేయిస్తారా? అనేది ఇప్పుడు జోరుగా ప్రచారం జరుగుతోంది. సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దానంను పోటీ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన బిఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉండి.. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా బరిలో ఉంటారనే ప్రచారం గందరగోళం రేపుతోంది. వాస్తవానికి దానం నాగేందర్ చేరిక సందర్భంగా జరిగిన చర్చల్లో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో పోటీ చేయాలని, ఖైరతాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీ నామా చేయాలని ఆయనకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు స్పష్టతనిచ్చినట్లు తెలిసింది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేయాలనే ప్రతిపాదన మేరకు ఆయన కాంగ్రెస్‌లో చేరారు. సిఎం రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని పార్టీ అధిష్టానానికి వివరించాకే.. నాగేందర్‌కు ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఏఐసీసీ ఖరారు చేసింది. కానీ ఆయన రాజీనామాపై ఊగిసలాటలో పడ్డారు. ఇప్పటి వరకు దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేమయకపోవడంతో అటు బిఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వర్గాల్లో దానం హాట్ టాపిక్ అయ్యారు. దీంతో ఏఐసీసీ..సికింద్రాబాద్ అభ్యర్థిని మార్చే ఆటోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో మళ్ళీ తెరపైకి బొంతు రామ్మోహన్ పేరు వినిపిస్తోంది.

## నలుగురి ఆత్మహత్యకు కారణమైన ప్రధాన నిందితుడికి రిమాండ్



శంకర్‌పల్లిలో ఒకే కుటుంబంలోని నలుగురి ఆత్మహత్యకు కారణమైన తిరుపతిరావ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

నార్సింగి, మార్చి 30 ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఆత్మహత్యకు కారణమైన ప్రధాన నిందితుడిని శనివారం మోఖిల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఏసీపీ రమణాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా రాజ్యం ప్రాంతానికి చెందిన తిరుపతిరావ్(43) డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఇతడు గతంలో చైన్ లింక్ స్కీంలో రూ.500.కట్టి కమీషన్ వస్తుందని చేరాడు. ఎంతకీ డబ్బులు రాకపోవడంతో తానే ఓ మనీ సర్క్యులేషన్ స్కీమ్‌ను పెట్టాలని భావించి యూట్యూబ్‌లో సెర్చ్ చేశాడు. యూట్యూబ్‌లో లభించిన సమాచారంతో తన నాన్న పేరుపై జివిఎస్ ఫౌండేషన్‌తో వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశాడు. ఈ స్కీంలో చేరాలనుకునే వారు రూ.600కట్టి జైన్ అవ్వాలని, మరో ఇద్దరిని చేర్పిస్తే 10.శాతం కమీషన్ ఇస్తానని నమ్మబలికాడు. మొదట్లో చాలా మందికి కమీషన్ డబ్బులు ఇచ్చాడు. ఈ క్రమంలోనే శంకర్‌పల్లికి చెందిన రవీ ఈ స్కీంలో చేరి మూడు ఐడీలు తీసుకున్నాడు. తనకు తెలిసిన వారందరిని చేర్పించాడు. రవి మొత్తం రూ.13.లక్షలను తిరుపతిరావ్‌కు చెల్లించాడు. మొదట్లో బాగానే కమీషన్ ఇచ్చిన తిరుపతిరావ్ కొన్నాళ్లుగా కమీషన్ ఇవ్వకుండా, రవి ఫోన్ చేసినా స్పందించలేదు. కానీ రవి వద్ద జాయిన్ అయిన ప్రజలు మా డబ్బులు మాకివ్వాలని ఒత్తిడి చేశారు. చాలా మందికి డబ్బులు తిరిగి ఇచ్చాడు. కొంత మందికి ఇవ్వలేదు. ఈ విషయంను తెలుసుకున్న కొందరు విలేకరులు రవిని సంప్రదించి, మాకు డబ్బులు ఇవ్వాలి, లేదంటే పత్రికలలో నీవు ప్రజలను మోసం చేశావని వార్తలు రాస్తామని బెదిరించారు. రవి తన భార్య పుస్తెల తాడును తాకట్టు పెట్టి కొంత డబ్బులు ఇచ్చాడు. అయినా విలేకరులు మొత్తం రూ.20.లక్షలు ఇవ్వాలని ఒత్తిడి పెంచడంతో రవి ఈనెల 3.వ,తేదీన తన ముగ్గురు కుమారులకు ఉరేసి, తాను ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు మోఖిల పోలీసులు మొత్తం ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. మిగితా వారి కోసం గాలిస్తుండగా తిరుపతిరావ్ పట్టుబడ్డాడు. ఇతడిని కూడా శనివారం రిమాండ్‌కు తరలించామని ఏసీపీ వివరించారు.

## ఎన్నికల విధులు అవగాహనతో నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రోనాల్డ్‌రోస్

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో నిర్వహించినప్పుడే పొరపాట్లు జరగకుండా ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ అన్నారు. ఈమేరకు శనివారం బంజారాహిల్స్ లోని బంజారాభవన్‌లో సెక్టార్ ఆఫీసర్లు, జిల్లా స్థాయి నియోజకర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి కమిషనర్ రోనాల్డ్‌రోస్, కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్లు ప్రతిఅంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకర్గ స్థాయిలో పివో,ఏపివోలకు శిక్షణ ఇచ్చినప్పుడే వారి సందేహాలను నివృత్తి చేయాలని అందుకు ముందుగా నియోజకవర్గ స్థాయిలో మాస్టర్‌రటైనర్స్‌కు తీసుకుంటున్న శిక్షణలో ప్రతిఅంశంపై పట్టుఉండాలన్నారు. ఎన్నికల సిబ్బందికి ఎంతో అవగాహనతో పనిచేస్తే ఎన్నికలు అంత బాగా జరుగుతాయన్నారు. మాక్‌పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పివో,ఏపివోలకు అన్ని విషయాలపై ఎఎల్‌టిఎంలు స్పష్టంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మాక్‌పోల్ నిర్వా హణ, ఈవిఎం ఆపరేట్ చేయడం, ప్రిసైడింగ్ అధికారుల విధు లు, బాధ్యతలను ప్రీపోల్ ,పోలింగ్ తర్వాత చేయాల్సిన ప నులు విడమర్చి చెప్పాలని, నిబంధనలను వివరించాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు అప్ర మత్తంగా ఉండాలని క్షేత్రస్థాయిలో ప్రతిపోలింగ్ కేంద్రం పరిధి లో నెలకొన్ని ఉన్న పరిస్థితులను ముందుగానే గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దబూష్టికి తేవాలనిసూచిం చారు. అంతకుముందు ఈవిఎం, వివిప్యాట్, బ్యాలెన్స్ పేపర్, మాక్ పోలింగ్, పిన్‌సీల్ వినియోగం, సెక్టోరల్, మాస్టర్ ట్రైనర్ల విధులు తదితర అంశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈకార్యక్రమంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కెడే, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిఈవో మధుకర్ నాయక్, ఎన్నికల అదనపు కలెక్టర్ అలివేలు మంగతాయారు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక 3లో

## దేశ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో బిజెపి విఫలం

### మతోన్మాద బిజెపిని ఓడించాలి ● 11 వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు పిలుపు




సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చిక్కడపల్లి, మార్చి 30 ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దేశ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని 11 వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు విమర్శించాయి. బిజెపి ప్రజల దృష్టిని పక్కదోవ పట్టిస్తున్నదనీ, మతోన్మాద విధానాలను ముందుకు తెస్తున్నదనీ, నియంతృత్వ విధానాలను అమలు చేస్తున్నదని తెలిపాయి. బిజెపి ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర సదస్సు సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గసభ్యుడు డిజి.నర్సింహారావు అధ్యక్షతన జరిగింది. రాజ్యాంగ రక్షణ కోసం బిజెపిని ఓడించాల్సింది దేనని, పదేండ్ల బిజెపి పాలనలో ప్రజల బాధలు తీరలేదని, కార్పొరేట్లకు దాసోహమైన మోదీ విధానాలు అని అన్నారు. మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి...ప్రజా సమస్యలు పక్కదారి పట్టించే కుట్రలు జరుగుతున్నాయని, కోట్ల మంది ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించలేని దైన్యం అని అన్నారు. రాష్ట్రంలో పంటలెండుతున్నా, మంత్రులు పరిశీలించడం లేదన్నారు. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాద చర్యలను ఎండగట్టేందుకు ఆందోళనలు, సదస్సులు, ప్రచార క్యాంపియన్ నిర్వహించాలని సదస్సు తీర్మానించింది. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాజ్యాంగం ఆధారంగా ఎన్నికైన మోదీ ఆ విలువలనే తుంగలో తొక్కుతున్నారనీ, నిరంకుశ పద్ధతుల్లో పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. మోదీని, బిజెపిని ప్రశ్నించే వారిని, వారిని సహించడం లేదన్నారు. ఈడీ, సిబిఐ, ఐటి ద్వారా దాడులు చేసి తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని, జైళ్ళకు పంపుతున్నారని, బిజెపి బ్లాక్‌మెయిల్ ఎత్తుగడలకు లొంగి ఆ పార్టీలో చేరితే ఎంతటి నేరస్తులైనా కేసులుండడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో సిఎఎ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పిఆర్‌ల బూచీ చూపి మైనారిటీలను భయభ్రాంతులకు గురిచేసేందుకే కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మిగతా సిటీ 3వ పేజీలో

## ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలి

**ఈటెల రాజేందర్**



మహేంద్రహిల్స్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ తదితరులు

కంటోన్మెంట్, మార్చి 30 ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని మల్కాజిగిరి లోక్ సభ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ అన్నారు. మహేంద్రహిల్స్ లోని బిజెపి నేత మల్క కొమురయ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికార అహంకారంతో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను, ముఖ్య నాయకులను తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలో చేర్చుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీతో 8 మంది బిజెపి ఎమ్మెల్యేలు టచ్చిలో ఉన్నారని, మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వాఖ్యలపై తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేత యశెస్వీ తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 3న కంటోన్మెంట్ మాదిగల సింహగర్జన



విలేకర్ల ఎసమావేశంలో కంటోన్మెంట్ మాదిగల బలం ప్రతినిధులు ఇటుక శ్రీ కిషషన్, ఇటుక గోపీ మాదిగ, శారద మల్లేశ్ తదితరులు

కంటోన్మెంట్, మార్చి 30 ప్రభాతవార్త: షెడ్యూల్డ్ కులంలో అధిక జనాభా కలిగి ఉన్న మాదిగలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మాదిగలకు టికెట్లు కెటాయించాలని కంటోన్మెంట్ మాదిగల బలం ప్రతినిధులు ఇటుక శ్రీ కిషన్ మాదిగ, ఇటుక గోపీ మాదిగ, రొట్టెల సునీల్ మాదిగ, శారధ మల్లేశ్ మాదిగలు డిమాండ్ చేశారు. శనివారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూకంటోన్మెంట్ మాదిగల బలం నిరూపించుకునేందుకు ఏ ప్రిల్ 3వ తేదీన కంటోన్మెంట్ మాదిగల సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. గత 45 సంవత్సరాల నుంచి కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వుడ్ అయినప్పటికి మాదిగ బిడ్డలకు అవకాశం దొరకలేదన్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపీలు మాదిగలకు టికెట్లు కెటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజిత్ కళ్యాణ్, శంకర్, మంద శంకర్ మాదిగ, మంద మధుకర్ మాదిగ, బ్యాగర నర్సింహా మాదిగ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ఏ రాజకీయ పార్టీ పురుషుల హక్కులు, భద్రతపై పట్టించుకోవడం లేదు

సైఫాబాద్, మార్చి 30 ప్రభాతవార్త: దేశంలో ఏ రాజకీయ పార్టీ, ప్రభుత్వాలు పురుషుల సంక్షేమం, భద్రతపై ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని పురుషుల హక్కుల సంఘం బాధ్యుడు గుర్మిత్‌సింగ్ ఆరోపించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు పురుషుల ఏకారణంతో ఓట్లు వేయాలని ఆయన ప్రశ్నించారు. శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురుషుల భద్రతకు ఏలాంటి చట్టాలు లేని కారణంగా వేధింపులకు గురవుతున్నారని, అంతే కాకుండా మానసిక క్షోభకు గురవుతున్నారని, ప్రతి ఏడాది పురుషులు దేశవ్యాప్తంగా కుటుంబ కలహాల కారణంగా 90 వేల మంది పురుషులు ఆత్మహత్యలు పాల్పడుతున్నారని, ఇవి కేంద్ర ప్రభుత్వ లెక్కలని ఆందోళన వ్యక్తం చేశారు. భార్య, భర్తలు విడిపోతే పిల్లలను చూసుకునే అవకాశం పురుషులకు దక్కడం లేదని, న్యాయస్థానాలను అశ్రయించి అప్పుడు వెళ్ళవలసి వస్తున్నదని, పురుషుల కోసం న్యాయ స్థానాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని రాజకీయ పార్టీలు పురుషుల హక్కులపై ఎన్నికల మ్యానిఫెస్టోలో స్పష్టమైన వ్యాఖ్యలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాలలో పెద్ద పీఠవేస్తున్నాయని, కాని పురుషుల గురించి పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిక



అల్లాపూర్ డివిజన్ బిఆర్ఎస్ యూత్ ప్రసిడెంట్ దేవిరింటి మస్తాన్‌రెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండిరమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు

యూసుఫ్‌గూడ, మార్చి 30, ప్రభాతవార్త : బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పనిచేసినప్పటికి తనకు తగిన విధంగా గుర్తింపు ఇవ్వనందుకే ఆపార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని దేవిరింటి మస్తాన్ రెడ్డి అన్నారు. అల్లాపూర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ డివిజన్ యూత్ అధ్యక్షులు వివేకానందనగర్ కాలనీ వి టీమ్ అధ్యక్షులు దేవిరింటి మస్తాన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండిరమేష్ మస్తాన్‌రెడ్డికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తూ ప్రజా సమస్యల కోసం తనవంతు కృషిచేస్తారని మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొయినుద్దీన్, నాయకులు అంకమరావు, ఆదినారాయణ, సతీష్‌రెడ్డి,, సత్యనారయణ, భాను, అనీల్ కుమార్‌లు పార్టీలో చేరారు. పాల్గొన్న వారు డివిజన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శ్రీనువాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కనకయ్య ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన



బండ్లగూడ అభ్యుదయ నగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నార్సింగి, మార్చి 30 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని అభ్యుదయనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. సన్‌సిటీలోని షాలినీ ఆసుపత్రికి చెందిన డాక్టర్స్ వచ్చి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగానే పంపిణీ చేశారు. హైదర్షాకోట్‌కు చెందిన థైరో కేర్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులు ప్రజలకు ఉచితంగా వివిధ పరీక్షలు నిర్వహించి, రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు నాగుల నరేందర్ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యంను అందించడం అభినందనీయమన్నారు. సంపాదన ఒక్కటే కాకుండా సేవా మార్గం ద్వారా వైద్యం అందిస్తున్న వైద్యులకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలపుతున్నామన్నారు. అనంతరం డాక్టర్ షాలిని మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తరుచూ కంటి పరీక్షలు చేయించుకుంటే ఆ వ్యాధిని ఆరంభంలోనే గుర్తించి నయం చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధి నరేందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జగదీశ్వర్‌రావు తదితరులు

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: వికాలంగులకు స్థానిక సంస్థలనుంచి చట్టసభల వరకు రాజకీయ రిజర్వేషనున్లు కల్పించాలని మంథని నియోజకవర్గం ముత్తారం మాజీ సింగల్‌విండో డైరెక్టర్ నాగినేని జగదీశ్వర్‌రావు అన్నారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికాలంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించినప్పుడే వారి పక్షాన ప్రశ్నించే గొంతుకు నాంది పలికే అవకాశంఉంటుందన్నారు. అలాగేకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాల్లో 5శాతం వికలాంగులకు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రస్తుతం 2024 లెక్కల ప్రకారం భారతదేశంలో సుమారు 15శాతం దివ్యాంగ కుటుంబాలు ఉండగా అందులో 10కోట్లకు పైగా ఓటర్లు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. కావున వికలాంగులకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## పొరుగు జిల్లాల నుంచి వస్తున్న ఆటోలను నిషేదించాలి

సైఫాబాద్, మార్చి 30 ప్రభాతవార్త: జంటనగరాలలోకి పొరుగు జిల్లాల నుంచి చట్ట వ్యతిరేకంగా వస్తున్న ఆటోలను అరికట్టడంలో నగర పోలీస్ కమిషనర్, జేటిసి ఆర్టీఎ కార్యదర్శి ఘోరంగా విఫలం చెందారని, తక్షణమే వీరిని సస్పెండ్ చేయాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఎసి కన్వీనర్ ఎండి అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొరుగు జిల్లాల నుంచి వచ్చిన ఆటోలు జంటనగరాల్లో విచ్చల విడిగా తిరుగుతున్నాయని, దీంతో స్థానిక ఆటో డ్రైవర్లకు గిరాకిలు లేక ఆనే ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరొక వైపు ప్రభుత్వం ఆర్టీసీ బస్‌లలో మహిళలకు ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి వర్ణించడానికి వీలు లేకుండా పోయిందని, అప్పులు తీర్చలేక డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను సిఎం తక్షణమే అమలు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## రన్‌ఫర్ జీసస్ ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న మాజీ కార్పోరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, మార్చి 30, ప్రభాతవార్త: రన్‌ఫర్ జీసస్ (శాంతి ర్యాలీ)ని శనివారం 130 డివిజన్ మాజీ కార్పోరేటర్ సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కుత్బుల్లాపూర్ పాస్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సురేష్‌రెడ్డి మాట్లాడుతూ క్రైస్తవులందరికీ ఎప్పుడు అందుబాటులో ఉంటానని, ఇలాంటి కార్యక్రమాల వల్ల దేశంలో గల ప్రజలను సన్మార్గంలో నడిచేలా చేస్తాయని అన్నారు. అందరూ కూడా మంచిని తీసుకుని చెడును పారద్రోలాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## టెట్‌పై ఉపాధ్యాయులకు వివరణ ఇవ్వాలి



అడిషనల్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్నఉద్యోగ సంఘాల నేతలు

ముషీరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: టెట్ విషయంపై ఉపాధ్యాయులకు క్లారిటీ ఇవ్వాలని వివిధ ఉద్యోగ సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వనివారం యూఎస్‌పీసీ, జాక్టో, పీఆర్టీయూటీఎస్, ఆర్‌యూపిపిటీఎస్ సంఘాల నేతలు డీఎస్ఈ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ లింగయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు టెట్ విషయం గురించి చర్చలు జరిపారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల సందేహాలపై వీలైనంత త్వరగా వివరణ ఇచ్చి, ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని సంఘాల నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి, టీపీటీఎఫ్ నాయకులు పి.నాగిరెడ్డి, డీటీఎఫన నాయకులు టి.లింగారెడ్డి, ఎస్టీయూ నాయకులు జి.సదానందం గౌడ్, ఇఫ్తేకార్ అహ్మద్, పీఆర్టీయూటీఎస్ నాయకులు కే.కమలాకర్‌రావు, ఆర్‌యూపీపీటీఎస్ నాయకులు జి.జగదీష్, లింగం, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## సకల జనులు సంతోషంగా ఉండాలి



ఆర్‌కె సొసైటీలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మహా కుంభాభిషేకం మహోత్సవంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనువాస్ గుప్త

యూసుఫ్‌గూడ, మార్చి 30, ప్రభాతవార్త : సకల జనులు అంతా సంతోషంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనువాస్ గుప్త అన్నారు. శనివారం బోరబండ ఆర్‌కె సొసైటీలోని శ్రీచక్రసాహిత శ్రీవాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో శ్రీచక్రమేరు ధ్వజస్థంభ మంత్ర ప్రతిష్ట సహిత మహా కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంటు కార్పోరేషన్ పూర్వచైర్మన్ ఉప్పల శ్రీనువాస్ గుప్త పాల్గొన్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి మాతకు జరిగిన అభిషేకం యాగంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అర్చక స్వాములు వేదమంత్రాలతో కండువలతో సన్మానించి ఆశీర్వదించారు.

### హనుమాన్ మందిరంలో పూజలు నిర్వహించిన మాధవి లత



చార్మినార్, మార్చి 30 ప్రభాతవార్త : హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్ధి డాక్టర్.మాధవి లత శనివారం పాతబస్తీ లాల్‌దర్వాజలోని శ్రీహనుమాన్ మందిరాన్ని సందర్శించారు. శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి సి.క్రిష్ణాయాదవ్, బిజెపి నాయకులు యమన్ సింగ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## యువత, పేదవర్గాల కోసం పథకాలు ప్రవేశపెట్టాం: ఎంపి లక్ష్మణ్



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 30 ప్రభాతవార్త: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు 'లభర్తి సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని రాజ్యసభ సభ్యుడు, బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని కరోనా లేన్, చిక్కడపల్లి స్ట్రీట్ నెంబర్ 10లో బిజెపి రాష్ట్ర ఇండస్ట్రీయల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సి.పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన 'లభర్తి సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్ పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంఆ బడుగు, బలహీనవర్గాలు, యువత, పేదవర్గాల కోసం పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ పథకాల ద్వారా లబ్దిపొందిన కోట్లాది మంది ప్రజలు దేశంలో ఉన్నారన్నారు. ప్రధానమంత్రిగా వీధి వ్యాపారులకు రుణాలు, కిసాన్ సమ్మాన్ నిధి, హౌజింగ్ స్కీం, రూరల్ స్కిల్ ట్రైనింగ్ పొందిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉజ్వల గ్యాస్ పథకంలో ఉచితంగా గ్యాస్ పొందుతున్న వారున్నారని, దేశవ్యాప్తంగా దాదాపు 54లక్షలమంది వీధివ్యాపారులు చేసే వారికి ఆర్థిక సహాయం చేసి వడ్డీ లేకుండా రుణాలను అందించామని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నేతలు గుండగౌని భరత్‌గౌడ్, రమేశ్‌రామ్, శక్తిసింగ్, ఉడుతల బాలకృష్ణగౌడ్, జైపాల్‌రెడ్డి, గడ్డం నవీన్, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, గోకా మంగళ, కిరణ్‌కుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి, వరంగల్ సీటును ఎస్సీ ఉపకులాలకు కేటాయించాలి

**ఎస్సీఉపకులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి**




సమావేశంలో పాల్గొన్న బైరి వెంకటేశం తదితరులు

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: దళితుల్లో 35శాతం జనాభా కలిగి అత్యంత వెనకబడ్డ ఉపకులాలకు పెద్దపల్లి లేదా వరంగల్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కేటాయించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం 63లక్షల దళిత జనాభా ఉంటే మిగతా ఉపకులాలకు 22లక్షల జనాభా కలిగి ఉన్నారన్నారు. ఇప్పటివరకు ఎంపి.ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ, రాజ్యసభ, ఎస్సీ కమిషన్ తదితర రాజ్యాంగ బద్ధ పదవులన్నీ మాల, మాదిగలే అనుభవించారన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మాదిగలకంటే ఎస్సీ ఉపకులాలదే మెజార్టీ జనాభా కలిగి ఉన్నారని అందువల్ల కాంగ్రెస్ పార్టీ ఇక్కడి స్థానాన్ని ఉపకులాకు కేటాయిస్తే గెలిపించి తీరుతామని అన్నారు. వరంగల్ స్థానంలో కూడా ఉపకులాల జనాభా అధికంగా ఉఒందని ఇక్కడనుంచి కూడా ఉపకులాలకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కడియం శ్రీహరి ఈనాటికి తాను మాదిగనేనని చెప్పుకుంటున్నారని ఆయనకు మా ఉపకులాలతో ఎలాంటి సంబంధంలేదన్నారు ఒకవేళ ఆయన కాంగ్రెస్‌పార్టీలో చేరినా టికెట్ ఇవ్వకూడదని నిజమైన ఉపకులాల నాయకులకే కేటాయించాలని కోరారు. ఈసమావేశంలో వివిధ ఉపకులాల నాయకులు పాల్గొన్నారు.

## మత్తుమందు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**90 గ్రాముల చరస్ స్వాధీనం.. రిమాండ్‌కు తరలింపు**

దుండిగల్, మార్చి 30 ప్రభాతవార్త: గుట్టుచప్పుడు కాకుండా మత్తుమందు విక్రయిస్తున్న వ్యక్తిని బాలానగర్ ఎస్‌వోటి పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద చరస్(మత్తుమందు)90గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మ సమీపంలోని రాజుబస్తీకి ప్రభుత్వ నిషేదిత చరస్ (మత్తుమందు)ను విక్రయించేందుకు ఓ వ్యక్తి వస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌వోటి పోలీసులు శనివారం ఉదయం నిఘా వేశారు. ఉదయం 8గంల ప్రాంతంలో ఓ వ్యక్తి అనుమాస్పదంగా తిరగాడాన్ని గమనించి ప్రశ్నించగా తప్పించుకోవడానికి ప్రయత్నించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారించగా పక్కన ఉన్న పొదలో నుండి తెల్లటి బ్యాగు తీసుకురాగా అందులో డిజిటల్ వెయింగ్ మిషన్, 90గ్రాముల చరస్ మందు లభ్యమైంది. నిందితుడు మల్లంపేటలోని ఎస్ఆర్‌కె హోమ్స్ విల్లా-12కు చెందిన ఉదయ్‌కుమార్(29)గా గుర్తించారు. నిందితుడు డాగ్‌బ్రీడర్ గా పనిచేస్తూ మరోవైపు హిమాచల్‌ప్రదేశ్ ప్రాంతం నుండి చరస్ తీసుకువచ్చి కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుని వద్ద డిజిటల్ వెయింగ్ మిషన్, రూ,80వేల రూపాయల విలువగల 90గ్రాముల చరస్, ఒమొబైల్ ఫోన్, రూ,11వేల నగదును స్వాధీనం చేసుకొని దుండిగల్ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.

## జగ్జీవన్ రామ్ జయంతిని విజయవంతం చేయాలి



జగ్జీవన్ జయంతి వేడుకల ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

అత్తాపూర్ మార్చి 30, ప్రభాతవార్త : బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ ముఖ్యనాయకులను ఉత్సవ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సామ ఇంద్రపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాల్ రాజులను కలిసి ఏప్రిల్ 5న అరంఘర్ చౌరస్తాలో నిర్వహిం చే బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు రావాలని ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు, ప్రధాన కార్యదరినశ ఎడ్లకాడి సూర్యం, జంగయ్య, సంజీవ, బర్ల సుమన్, గుంటి శోభ, కోరని సదానంద్, తదితరులు ఉన్నారు.

## పురాతన హన్‌మాన్ దేవాలయం వద్ద సేనా ప్రతినిధులు



అఫ్జల్‌గంజ్, మార్చి 30ప్రభాతవార్త: జియాగూడలోని చారిత్రాత్మకమైన హన్‌మాన్ మందిరాన్ని కబ్జాకు పాల్పడేందుకు ప్రయత్నించే వారికి ప్రభుత్వపరంగా తగిన గుణపాఠం చెబుతా మని తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త హెచ్చరించారు. ఈమేరకు శనివారం జియాగూడలోని హన్‌మాన్‌మందిరం ప్రాంతాన్ని భజరంగ్‌సేనా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అక్కడ హన్‌మాన్‌మందిరంలో ప్రత్యేకపూజలను చేశారు. సేనాప్రతి నిధులను శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో సేనాప్రధాన కార్యదర్శి సూర్యశుక్లా, సేనాప్రతినిధులు రామేశ్వర్ మిశ్రా, పవన్ గౌర్, సర్దార్‌గురుమిత్‌సింగ్, రాహు ల్, వినయ్‌కుమార్, జశ్వంత్, జి.వి.కె. వెంకట్, పవన్ ఇండోరియా, పురషోత్తం, పూజారిశంకర్, దీపక్, నరేష్ పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించరాదు

సైఫాబాద్, మార్చి 30 ప్రభాతవార్త: రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు తరుచు పార్టీలు మారడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీలోకి నాయకులు, ప్రజా ప్రతినిధులు తరుచు మారడం వల్ల ప్రజలు ఛీదరించుకుంటున్నారని, రాజకీయాలు అంటే విలువలు లేకుండా పోయిందని, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. సమయం వచ్చినప్పుడు పిరాయింపు దారులకు సరైన గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు. ఈ పిరాయింపులు కొత్తగా జరగడం లేదని, ఎప్పటి నుంచో కొనసాగుతున్నాయని, ఇకనైనా చరమగీతం పాడాలని ఆయన సూచించారు.

## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

అత్తాపూర్ మార్చి 30, ప్రభాతవార్త : ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును చోరికి పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. ఉప్పర్‌పల్లి ప్రాంతంలో ఇంటి ముందు కూర్చున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని ఓ మహిళ తెంపుకొని పారిపోయిందని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

### జెఎన్‌టియులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కాన్ఫరెన్స్ ప్రారంభం

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 30, ప్రభాతవార్త: భారతదేశంలోని అతిపెద్ద కాన్ఫరెన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్)ఎఫ్ ఏఐడే 2024 శనివారం హైదరాబాద్‌లోని జెఎన్‌టియులో ప్రారంభమైంది. దీనిని థీమ్‌తో నిర్వహిస్తున్నారు. భాగస్వాముల సహకారంతో స్వేచ్ఛ ఈ రెండు రోజుల కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తుంది. ఈ సదస్సులో రెండు వేల మందికి పైగా ఐటీ నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, విద్యార్థులతో పాటు ప్రముఖ టెక్ కంపెనీల నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఏఐ, ఎంఎల్ నిపుణులు హాజరయ్యారు. ఈ సదస్సుతో హైదరాబాద్ ఏఐ రాజధానిగా మారేందుకు మార్గం సుగమం అవుతుంది. ఏఐ డేస్ వివిధ రంగాలకు చెందిన నిపుణులను ఒకచోటకు చేర్చింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, అగ్రిటెక్, ఫిన్‌టెక్, సెమీ కండక్టర్స్, ఎడ్యుటెక్, వివిధ స్టార్టప్‌లు సమాజ శ్రేయస్సు కోసం ఏఐని నిర్మించడంలో ముందుకు సాగే మార్గం కోసం గూగుల్, ఫేస్‌బుక్(మెటా) మైక్రోస్టాఫ్ట్, క్వాల్కామ్, మైక్రాన్, ఓజోనెటెల్, టెక్ వేదిక, డిజీక్వాన్టా, ఆర్కా మీడియా వర్క్స్ వంటి ఇతర సంస్థల స్పీకర్‌లు చర్చలలో పాల్గొన్నారు.

## త్రాగునీరు సమస్యలు తలెత్తకుండా చర్యలు: కమిషనర్ సత్యనారాయణరావు

**నీటి సరఫరా ఏర్పాట్లపై సమీక్షా సమావేశం**



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్, మార్చి 30 ప్రభాతవార్త: వేసవికాలం సందర్భంగా త్రాగునీరు సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు దుండిగల్ పురపాలిక కమీషనర్ సత్యనారాయణరావు పేర్కొన్నారు. రానున్న మూడునెలల పాటు త్రాగునీరు సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయుటకు గాను శనివారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బి, మిషన్‌భగీరథ, పురపాలిక ఏఈ, వార్డు ఆఫీసర్లు, వాటర్‌మెన్‌లో వార్డుల వారీగా ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. వేసవి పూర్తయ్యే వరకు వాటర్‌మెన్‌ల సమన్వయంతో త్రాగునీరు సరఫరా సవ్యంగా జరగడానికి పర్యవేక్షన చేయుటకుగాను ఆయా వార్డులకు చెందిన వార్డు ఆఫీసర్లకు ప్రధాన బాధ్యతలను అప్పగించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎక్కడైనా త్రాగునీరు సమస్య తలెత్తినచో వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి పరిష్కరించడంతో పాటు ఎక్కెడైనా వాటర్ పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడినచో 24గంటల్లో మరమ్మత్తులు చేయాలని ఏఈ, వార్డు ఆఫీసర్లు, వాటర్‌మెన్‌లకు ఆదేశించారు. ప్రతి నీటి చుక్క చాల విలువైనదని, నేటి నుండి పురపాలిక పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఎక్కడా నీరు వృధా జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి వృధా ఆరికట్టుటకు సిబ్బంది చేసిన సూచనలను నిర్లక్ష్యం చేసినచో సదరు వ్యక్తులపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బి డిజిఎం శ్రీమహేశ్వరరావు, మిషన్ భగీరథ ఏఈ వసుధ మాట్లాడుతూ వార్డుల వారీగా సరఫరా చేస్తున్న నీటి పరిమాణం గురించి తెలియజేస్తూ రోజు తప్పించి రోజు ప్రతి కుటుంబానికి అవసరమయ్యే నీటి సరఫరా చేయుటకు తగు సూచనలు చేశారు. పట్టణ ప్రజలు వాటర్ కనెక్షన్ల కొరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని జతపరచవలసిన ధృవపత్రాల గురించి ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేయాలని, దరఖాస్తు చేసుకున్న వారికి వారం రోజులోన్ల వాటర్ లైన్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈసమావేశంలో పురపాలిక ఏఈ ప్రవీణ్‌కుమార్, మేనేజర్ నర్సింహులు, వార్డు ఆఫీసర్లు, వాటర్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా గంగుల అంజలి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా రఫియా బేగం నియామకం

నిజాంపేట్, మార్చి 30, ప్రభాతవార్త: గంగుల అజంలి యాదవ్ మల్కాజగిరి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా, షేక్ రఫియా బేగంను మేడ్చల్ మల్కాజ్‌గిరి మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, మేడ్చల్ మల్కాజగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీ ప్రతిపాదించి తెలంగాన ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత మొగిలి రావు నియమించినందున శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపి అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు సుజాత యాదవ్, శ్రీలత, ఫరహీన్ బేగం, నాగభవాని, శోభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో మార్నింగ్ వాకర్స్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 30, ప్రభాతవార్త: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి లోని ఫతేనగర్ డివిజన్ ఓల్డ్ ఎయిర్ పోర్ట్ రోడ్‌లో మార్నింగ్ వాకర్స్‌తో మల్కాజగిరి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ఈటెల దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలను తెలుసుకున్న ఈటెల రాజేందర్ త్వర లోనే పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. అనంతరం భరత్‌నగర్‌లోని భరత్ నగర్ వాకర్స్ అసోసి యేషన్ సభ్యులు, ఖైత్లాపూర్ గ్రౌండ్స్‌లో క్రికెట్ ఆడుతున్న యువకులతో ముచ్చటించారు. తనను మల్కాజ్‌గిరి ఎంపీగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు, అసెంబ్లీ ప్రబారీ పాపపయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కార్పోరేటర్ మహేందర్, శ్రీకర్‌రావు, కృష్ణగౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ శ్రామిక ప్రజలకు నివాస ఉపాధి హక్కులకు ఎన్నికల మేనిఫెస్టోలలో హామీ ఇవ్వాలి

**తెలంగాణ పట్టణ పోరాటాల వేదిక డిమాండ్**




కార్యక్రమంలో పాల్గొన్న మీరా సంఘమిత్ర, శంకర్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 30 ప్రభాతవార్త: పట్టణ శ్రామిక ప్రజలకు నివాస ఉపాధి హక్కులకు ఎన్నికల మేనిఫెస్టోలలో హామీ ఇవ్వాలని తెలంగాణ పట్టణ పోరాటాల వేదిక డిమాండ్ చేసింది. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు డిమాండ్‌లను ఆమోదించింది. బస్తీ ప్రజల నివాసాలకు పట్టణ భూమి, నివాస హక్కులకు పట్టణ శ్రామిక ప్రజలందరి పౌరహక్కులను కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా నగర శ్రామిక ప్రజల మేనిఫెస్టోను విడుదల చేసింది. జాతీయ ప్రజా ఉద్యమాల వేదిక నాయకురాలు మీరాసంఘమిత్ర, దళిత బహుజనఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, నిరాశ్రయుల శ్రామిక సంఘటన ప్రతినిధి సయ్యద్ ఫిరోజ్ మాట్లాడుతూ నగర బస్తీలలో పేదల ఇండ్లను బలవంతంగా కూల్చివేయమని ఎన్నికల మేనిఫెస్టోలలో హామీ ఇవ్వాలని, పేదలకు నగరంలోనే నివాసం కల్పించాలని, పునరావాసం పేరుతో నగరం బయటకు బలవంతంగా తరలింపును నిలిపివేయాలని కోరారు. ఉమ్మడి పట్టణ వనరులను పరిరక్షించాలని, పట్టణ జీవనోపాధి హామీ చట్టం అమలులోకి తీసుకురావాలని, గౌరవప్రదంగా జీవనోపాధికి భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, ఎన్‌ఎపిఎం నాయకులు జాన్, మానవహక్కుల వేదిక నాయకులఉ ఇందిరా వినయ్, నవీన్,మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## నీటి వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతున్న రెవెన్యూ అధికారులు



గండిపేట మండలంలో నీటి వ్యాపారాని ఉపయోగిస్తున్న బావులను ధ్వంసం చేస్తున్న రెవెన్యూ అధికారులు

నార్సింగి, మార్చి 30 ప్రభాతవార్త : గండిపేట మండలంలో నీటి వ్యాపారంపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలో ఉన్న నీటి బావులను మూడు జేసీబీలు ఉపయోగించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ అసలే వేసవి కాలం ఉందని, ఇప్పుడు ఇళ్లల్లోని బోర్లు ఎండుతున్నాయని, ఈ సమయంలో వేల ఫీట్ల దిగువకు బోర్లు వేసి 24.గంటలు పవర్ మోటార్లతో భూగర్భ జలాలను తోడి నీటి వ్యాపారం చేయడం చట్టరిత్య నేరమన్నారు. నీటి వ్యాపారం చేస్తే క్రిమినల్ కేసులు పెడ్తామని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో నీటి వ్యాపారం చేస్తున్న వారికి హెచ్చరించడం జరిగిందని, అయినా వినకుండా వ్యాపారం చేసే వారిపై కేసులు పెడుతున్నామన్నారు. శనివారం పెద్దఎత్తున నీటిని నిలువ చేసుకున్న బావులన్నింటిని ధ్వంసం చేశామని, ఇక ముందు వీరు మళ్లీ నీటి వ్యాపారానికి పాల్పడితే జైలుకే తరలిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. స్థానిక ప్రజలు సైతం మీ ప్రాంతాలలో ఎవరైనా అక్రమంగా నీటి వ్యాపారాలు చేస్తుంటే మా దృష్టికి తీసుకు రావాలని, మాకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## హమారా కిడ్స్ 6వ వార్షికోత్సవం



విద్యార్థినికి మెమెంటోను అందజేస్తున్న ధనరాజ్ యాదవ్

నిజాంపేట్, మార్చి 30, ప్రభాతవార్త: బండారి లేఅవుట్ రోడ్ నెంబర్ 3బీ, కమ్యూనిటీ హాల్ నందు హమారా కిడ్స్ 6వ వార్షికోత్సవ వేడకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం పిల్లలు నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలను వీక్షించి వారిని అభినందించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో మంచి విద్యను అందిస్తున్న హమారా కిడ్స్ స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన హమారా కిడ్స్ స్కూల్ డైరెక్టర్ పదమజా అమర, ప్రిన్సిపల్ మాధవి, ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ఆనంద్‌రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజలకు మేలు చేసే ప్రభుత్వంతోనే మేముసైతం నడుస్తాం

**మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగరావు**



పేట్ బషీరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త : ప్రజలకు మేలు చేసే ప్రభుత్వంతోనే మేముసైతం నడుస్తామని మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు అన్నారు. ఇటీవల ఆయన బిఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. శనివారం ఆయన సిపిఆర్ కాలనీలో, రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, యువనేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.పి.విశాల్‌గౌడ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి, ప్రతాప్ శాలువాతో సత్కరించరు. బొబ్బా రంగారావును పార్టీలోకి ఆహ్వానిస్తూ, పలు సూచనలు చేశారు. నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మాత్రమే పేదల అభివృద్ధి సక్రమంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజిలి కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరాజ్, గార శ్రీనివాస్, బిజిలి శంకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొలకలూరి మధుజ్యోతికి 'ఉత్తమ రచయిత్రి' పురస్కారం




రవీంద్రభారతి, మార్చి 30 ప్రభాతవార్త: ద్రావిడ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతికి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో తెలుగు విశ్వ విద్యాలయం 'ఉత్తమ రచయిత్రి' ప్రతిభా పురస్కారం అందజేసింది. అంతేకాకుండా 20,116 రూపాయల నగదును బహుకరించింది. తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏడాది వివిధ రంగాలలో విశేషమైన సేవలు, కృషి చేసిన 12 మంది ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తున్నది. 2022 సంవత్సరానికిగాను కొలకలూరి మధుజ్యోతికి ఉత్తమ రచయిత్రి పురస్కారం లభించింది. మధుజ్యోతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఎ తెలుగు పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించారని, 'తెలుగు సాహితీ వస్తు పరిణామం' అనే అంశం పైన పరిశోధన చేసి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పట్టా పొందారు. మధుజ్యోతికి సంస్కృతం, హిందీ భాషలు తెలుసునని, 30 సంవత్సరాలు బోధన, పరిశోధనలలో అనుభవం ఉందని, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, వేమన విశ్వవిద్యాలయం, వేద విశ్వవిద్యాలయం, కర్ణాకటలోని టుంకూరు విశ్వవిద్యాలయాలకు తెలుగు పాఠ్య ప్రణాళిక సంఘ సభ్యులుగా ఉన్నారు. ద్రావిడ వర్సిటీ విసికి ఉత్తమ రచయిత్రి పురస్కారాన్ని మధుజ్యోతి అందుకోవడం పట్ల వర్సిటి రెక్టార్ ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రార్ ఆచార్య ఎకె వేణుగోపాల్‌రెడ్డి, డా.ఎంఎస్ దుర్గాప్రవీణ్, పిఆర్‌ఓ, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, వర్సిటి విద్యార్థిని, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## బండ్లగూడ కార్పోరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడిగా నరేష్ నియామకం

**పార్టీ పటిష్టతకు అహర్నిషలు కష్టపడుతా : నరేష్**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ బిఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షడిగా అంతారం నరేష్‌కు నియామక పత్రంను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, మార్చి 30 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ బిఆర్ఎస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా అంతారం నరేష్ కుమార్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నియమించారు. శనివారం నరేష్‌కు మండల అధ్యక్ష నియామక పత్రంను ఎమ్మెల్యే అందజేసి, అభినందించారు. అనంతరం నూతన బిఆర్ఎస్ అధ్యక్షులు అంతారం నరేష్ కుమార్ మాట్లాడుతూ ఈ పదవి ఇచ్చిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, పార్టీ సీనియర్లు నాపై ఉంచిన నమ్మకంను మరింత పెంచుకునేందుకు అహర్నిషలు కష్టపడుతానని తెలిపారు. పార్టీ ఆదేశించిన ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని, పార్టీలోని జూనియర్, సీనియర్ నాయకులం దరిని కలుపుకొని ముందుకు వెళ్తానని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ నుంచి భారీ మెజారిటీని ఇచ్చేందుకు ప్రతీ బూత్ కమిటీని పటిష్టం చేస్తామన్నారు. కొత్త వారిని పార్టీలోకి తీసుకుంటా మని, కార్యకర్తలంతా సైనికులా పని చేయాలని, ఒక్కో కార్యకర్త 10.ఓట్లు వేయించేలా కార్యోన్ముఖులను చేస్తానని అంతారం నరేష్ కుమార్ స్పష్టం చేశారు. నరేష్‌కు కార్పోరేషన్ అధ్యక్ష పదవి రావడం పట్ల బిఆర్ఎస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



మృతున్ని బయటకు తీసుకొస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ బృందం

కొంపల్లి, మార్చి 30, ప్రభాతవార్త : ప్రమాదవశాత్తు చెరువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాచుపల్లిలో నివాసముండే కల్పన, హనుమంత (22) వీరు 2022 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు కూడా ఉన్నాడు. కల్పన, హనుమంత ప్రతిరోజు బైరం చెరువుకి వెళ్లి బట్టలు ఉతికి చెరువులో స్నానం చేసుకుని ఇంటికి చేరుకునేవారు. ఎప్పటిలానే శనివారం చెరువుకు వెళ్లి కల్పన బట్టలు ఉతుకుతుండగా హనుమంతు స్నానం కోసం చెరువు లోపలికి వెళ్లి ఎప్పటికీ రాకపోయేసరికి కల్పన అక్కడ స్థానికుల సహాయం కోరింది. వారంతా వెతికిన ఫలితం లేకపోవడంతో కల్పన బాచుపల్లి పోలీసులకి సమాచారం ఇవ్వడంతో వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఎన్‌డిఆర్ఎఫ్ సహాయంతో బైరం చెరువు నుండి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## సిఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ దొడ్ల



కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 30, ప్రభాతవార్త: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ దీపాదాస్ మున్షి చేతుల మీదుగా జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీతో కలిసి కార్పోరేటర్ వెంకటేష్‌గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటనలో ముగ్గురి అరెస్టు

**మొదటి పేజీ తరువాయి..**

లారీ డ్రైవర్‌తో పాటు లారీ యజమాని అర్జున్ సింగ్, ఫైబర్ నెట్ ఎండి రాఘవేంద్ర, రవికిరణ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇలాంటి ప్రమాదం జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రహదారుల్లో ప్రయాణికులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసులో లక్ష్మి ఇన్ ఫ్రస్ట్రక్చర్ ఎండి వేముల పల్లి కిరణ్, తాతారావ్, లారీ డ్రైవర్ ఉర్జీషేక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిసిపి రంగారావ్, ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజ్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరాములు, ఉప శంకర్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ రెడ్డిలు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో బోర్డులో ఇంజనీర్ల సేవలు మరువలేనివి : జంపనప్రతాప్



పదవీ విరమణ చేసిన ఇంజనీర్లను సత్కరిస్తున్న జంపనప్రతాప్, రాఘువరెడ్డి తదితరులు

కంటోన్మెంట్, మార్చి 30 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డులో 32 సంవత్సరాల పాటు క్రమశిక్షణతో విధులు నిర్వహించిన ఛీఫ్ ఇంజనీర్లు ఎం.గోపాల క్రిష్ణదాస్, బి.బాలక్రిష్ణల సేవలు మరువలేనివని, తోటీ ఇంజనీర్లు, ఉద్యోగులు వారిని ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వహించి కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు సేవలు అందించాలని సిఈఓ మధుకర్ నాయక్,బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, ప్రముఖ పారిశ్రామిక వేత్త,సామల రాఘువరెడ్డిలు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు ఛీఫ్ ఇంజనీర్లుగా పనిచేసిన గోపాలక్రిష్ణ దానస్, బాలక్రిష్ణలు పదవీ విరమణ చేసిన సందర్భంగా శనివారం జంపనప్రతాప్, రాఘువరెడ్డిలు వారికి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా సిఈఓ మధుకర్ నాయక్ బోర్డు సూపరిండెంట్‌లు ఎం.దేవేందర్, ఏ.మహేందర్, ఉమా శంకర్, ఫనికుమార్, తోటి ఉద్యోగులు వారిని ఘనంగా సత్కరించారు.

## ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక**



ఈవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

అత్తాపూర్ మార్చి 30, ప్రభాతవార్త : లోక్ సభ ఎన్నికలు ప్రశాంత వాతవరణం లో జరిగే విధంగా చూడాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అధికారులకు ఆదేశించారు. శనివారం రాజేంద్రనగర్ మండలం లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చిన ఈవిఎంలను తహసీల్దార్ రాములు,ఆర్డిఓ వెంకట్ రెడ్డి అడిషనల్ లోకల్ బాడి కలెక్టర్ ప్రతీమ సింగ్,ఎస్‌డిసిఐపి రాజులతో కలిసి కలెక్టర్ శశాంక పరిలించారు.ఈ సందర్భంగా రాండమైజేషన్ పూర్తి కావడంతో ఈవిఎంలను వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పలు నియోజకవర్గాల స్టోర్ రూమ్‌లకు పంపించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లను నిర్వహించాలని సూచించారు.

## నేడు నెక్లెస్‌రోడ్‌లో 5కెరన్




రన్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్లోకా, యశస్వీ, కళ్యాణ్,ధనుశ్రీ

హైదరాబాద్, మార్చి 30, ప్రభాతవార్త: నగర యువతలో ఆరోగ్యం సేవా దృక్పథంపై అవగాహన కల్పించే నిమిత్తం ఆదివారం ఉదయం నెక్లెస్‌రోడ్‌లో 5కే రన్ నిర్వహించనున్నట్లు పల్లవి ఫౌండేషన్ చైర్మన్ యశస్వీ మల్కా తెలిపారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రన్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రీట్‌కాజ్, మైఫిట్నెస్ స్టూడియో, పల్లవి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాని తెలి పారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నగర పోలీస్ కమిషనర్‌లు హాజరవు తారని తెలిపారు. అలాగే రన్‌తోపాటు బాండ్ ఎంటర్టైన్ మెంట్, జుంబా డ్యాన్స్, స్టాండప్ కామిడీ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 5.30గంటలకు నిర్వహించే ఈకార్యక్రమంలో యువత పెద్దసంఖ్యలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈక్యాక్రమంలో వివిధ సంస్థ ప్రతినిదులు శ్లోకా,సాహితీ సాయి, శృతి, కళ్యాణ్, ధనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో బిజెపి విఫలమైంది

**మొదటి పేజీ తరువాయి..**

ఎస్.వీరయ్య మాట్లాడుతూ పదేండ్ల మోదీప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరిం చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల్లో మెజారిటీ హిందువులు ఓట్లు పొందేందుకు మత వైషమ్యాలు సృష్టించేందుకు కుట్రలకు పూనుకుంటున్నాదని విమర్శించారు. ఈ సదస్సులో సిపిఎం(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్రకార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రనాయకులు జెవి.చలపతిరావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యుసిఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మురహరి,అరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకీ రాములు, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేశ్‌రాజా, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న ప్రసంగించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎన్.బాలమల్లేష్ వేదికపైకి నాయకులను ఆహ్వానించారు.

## అవకాడో తోటల పెంపకంపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్.బి.నీరజా ప్రభాకర్

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 30 ప్రభాతవార్త : శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఐజి డెక్కన్ ఎక్సోటిక్స్ సహకారంతో శనివారం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల ప్రాంగణంలో శాస్త్రీయ పరిజ్ఞానంతో అవకాడో తోటల పెంపకంపై అవగాహన సదస్సు జరిగింది.విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్.బి.నీరజా ప్రభాకర్ సదస్సును ప్రారంభంచారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో రాష్ట్రంలో అదకాడో తోటల పెంపకాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఫల పరిశోధన స్థానం,సంగారెడ్డిలో పరిశోధనలను ప్రారంభించామని తెలిపారు.అవకాడో మొక్కల పెంపకంతో పాటు సమృద్ధిగా ఉన్న ఔషద గుణాలు గురించి ఆమె రైతులకు విపులంగా వివరించారు. అదిలాబాద్, అశ్వా రావుపేట్ పరిశోధన కేంద్రాలలో కూడ నూతన శాస్త్రీయ పరిజ్ఞానంతో అవకాడోపై పరిశోధన జరిపి వాటి ఫలాలను రాష్ట్రంలో అవకాడో పెంపకంపై క్షేత్రస్థాయిలో ఆచరించవలసిన పరిజ్ఞానాన్ని రైతులకు అందించుటకు విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ ఉప కులపతి డాక్టర్.వి.ప్రవీణ్‌రావు, విశ్వ విద్యాలయం పరిశోధన సంచాల కులు డాక్టర్ ఏ కిరణ్ కుమార్,డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ రాజశేఖర్‌ఉద్యాన కళాశాల కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్.వి.ప్రశాంత్,ప్రిన్సిపాల్ ఐఐహెచ్‌ఆర్ బెంగుళూరు డాక్టర్ కరుణాకర్,స్ట్రాటజీ అండ్ ఫామ్ వైస్ ప్రెశిడెంట్ అమిత్ శర్మ పాల్గొన్నారు.


MISSING DOG



Name: MAXI
Breed: Indian
Colour: Golden Brown
Missing since 13 March from Malaysian Township, Kukatpally
REWARD APPLIES
CONTACT: 9810791341



వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, M Likith Neelakantam S/o. M Srinivasa Varaprasad R/o H.no 104, Veermani Srilaxmi Appartment, Swaroop Nagar, Uppal, Hyd-500039 T.S. Changed my Name as LIKITH NEELAKANTAM MOTHA.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



NOTICE

IN THE COURT OF THE HON'BLE XXV ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURTS : AT HYDERABAD

O.S.No. 105 OF 2024

Between :
C. Umarani & amp; others ...Plaintiffs
AND
The All Concerned & amp; others ...Defendants

To
The All Concerned ...Defendant No.1

Please take notice that, the above original suit is filed against you by the Plaintiffs for declaration of legal heirs seeking to declare them as legal heirs of late Sri C.Ravindra Charya, who died on 19-03-2023, before the Hon'ble XXV Additional Chief Judge, City Civil Courts, Hyderabad, and the above case stands posted to **24-04-2024** for appearance.Therefore, if any person/ persons having objection/objections or claims in this regard may appear/approach before the above Hon'ble Court on **24-04-2024** at 10:30 am. either in-person or through an advocate, failing which, the case will be heard and decided on merits in your absence.

K. VASUDEVA REDDY, CH. SRINIVAS & amp; B. KIRAN KUMAR, ADVOCATES,
FLAT NO.G-7, RAJESHWARI GAYATHRI SADAN, OPP : BHADRUKA GIRLS' JUNIOR COLLEGE, KACHIGUDA, HYDERABAD – 500 027.
Ph.No.9989710401.



IN THE COURT OF THE II ADDL. DISTRICT JUDGE-Cum-MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL: R.R.DISTRICT: AT L.B.NAGAR

M.V.O.P.No.106 OF 2018

Between:
Smt. Dodda Shailaja & others ...Petitioners
AND
Sri B. Ramesh Reddy (since died per LRs.) & others ...Respondents

To
6. Mohd Anwar Nagori,
S/o. Abdul Karim,
R/o. 97/2,South Toda,
Indore 452 001.

NOTICE

Whereas the petitioners above named havefiled the above MVOP seeking compensation against above Respondents herein, for that reason, you are hereby called upon to be present in person or through your counsel duly instructed on the **10-04-2024, at 10-30 a.m.** before the said Court, failing which, you will be exparte and the matter will be decided on merits.

//BY ORDER OF THE COURT//

V. MANOJ KUMAR
ADVOCATE
H.No. 2-4-36/E, PLOT No.12, ROAD No.9, NEW NAGOLE COLONY,
MOBILE No. 9948098503 8639336710



IN THE COURT OF THE II - ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT KUSHAIGUDA, HYDERABAD.

O.S. NO.284 OF 2024.

Between:
Smt. Katukam Swapna, And two others. ...Plaintiffs.
And
The Tahasildar, Mandal Revenue Office, Alwal and another. ...Defendants.

To:
All Concerned. ...Defendant No.3.

Whereas the above Suit filed for a declaration that the Plaintiffs are the Legal Heir of the deceased namely-Late Katukam Santhosh and the said suit is posted to **22nd April 2024 (Monday).**
Therefore any person or persons having objections in the subject matter are hereby advised to appear on the said date i.e., **22nd April 2024 (Monday)** at 10.30 AM before the said Hon'ble Court, and in the event of failure of your appearance on the said day, the matter will be dealt with and decided in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)

Sd/- S. BALACHANDER
Advocate
Plot No.63,Road No.1-C, Krishna Nagar Colony, N.F.C. Road, Moula-Ali, HYDERABAD-500 040. Cell - 9866165456

# కబ్జాల గురించి కెఎల్ఆర్ మాట్లాడడం హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న మురుకుట్ల అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, మార్చి 30 ప్రభాతవార్త:** మాజీ మంత్రి, మహేశ్వరం నియోజక వర్గం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గురించి మాట్లాడే స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేఎల్ఆర్‌ది కాదని, కబ్జాల గురించి ఆయన మాట్లాడడం హాస్యా స్పదంగా ఉందని మహేశ్వర నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులే పార్టీ గేట్లు ఓపెన్ చేశామని అంటు న్నారని, వాళ్లే ఇతర పార్టీ నాయకులను చేర్చుకుంటున్నారని అన్నారు. మీరు గేట్లు తెరిచినా మూసుకున్న సబితమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరేదిలేదన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా ముఖ్యమంత్రి నాయకుల ఇంటి వద్దకు వెళ్లి కండువా కప్పడం దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. ఓ ముఖ్యమంత్రి అంతగా దిగజారిపోయి రాజకీయాలు చేయడం ఎక్కడా లేదన్నారు. సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి అవినీతిపరులను పార్టీలోకి రాకూడదని ముఖ్యమంత్రి ముందే కేఎల్ఆర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట కట్టుబడి సబిత ఇంద్రారెడ్డి పార్టీ కోసం ఎంతో కష్టపడి పని చేయడంతో పాటు నియోజకవర్గాన్ని వేలాదికోట్లతో అభివృద్ధి చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలకు సేవ చేయాలంటే అధికార పార్టీలో ఉండాల్సిన అవసరం లేదని, సబితఇంద్రారెడ్డికి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. సబితమ్మ కోసమైతే మీరు నిశ్చయింతగా గేట్ మూసుకోవచ్చుఅన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులే సోషల్ మీడియాలో సబితాఇంద్రారెడ్డిపై పార్టీ మారుతుందని అసత్య ప్రచారాలు చేస్తున్నరన్నారు. నియోజకవర్గం గురించి అంతగా అవగాహన లేని కేఎల్ఆర్ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించి నట్లుగా ఉందన్నారు. సబితఇంద్రారెడ్డిపై అసత్య ఆరోపణలు, దుష్ప్రచారాలు చేస్తే సహించేది లేదని, రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసానిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో నాయకులు నేలకొండ శ్రీనివాస్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కంచర్ల శేఖర్, దుబ్బాక శేఖర్, మహ్మద్‌షఫీ, అల్లావుద్దీన్‌పటేల్, పాష తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి శ్రీ శారదా లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



గాయత్రీనగర్‌లోని శ్రీ శారదా లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం

**సరూర్‌నగర్, మార్చి 30 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ గాయత్రీనగర్ లోనున్న శ్రీ శారదా లక్ష్మీ నరసింహ స్వామి దేవాల యంలో ఆదివారం నుండి జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీ స్వయంప్రకాశ సచ్చితానంద సరస్వతిస్వామి మంగళ శాస నములతో ఆలయ షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఆలయం నిర్మించి ఎనిమిది సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శ్రీ శారదా లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ బ్రహోత్సవాలను ఏప్రిల్ మూడవ తేదీ వరకు నాలు గురోజుల పాటు నిర్వహించ నున్నారు. ఇందులో భాగం గా ఆదివారం సుప్రభాత సేవతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం సోమవారం శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి రథోత్సవం, మంగళవారం హోమం, బుధవారం లక్ష పుష్పార్చన, సాయంత్రం లక్ష్మీ నర్సింహ స్వామి శాంతి కళ్యాణం ఉంటాయి. ఈ నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయ వంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

## వరద నీటి కాలువ నిర్మాణంకోసం ప్రత్యామ్నాయ మార్గాలు : నవజీవన్‌రెడ్డి



కాలువ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, మార్చి 30 ప్రభాతవార్త :** వనస్థలిపురం తూర్పు కాలనీల నుంచి హైకోర్ట్ కాలనీ, జగదాంబ కాలనీ మీదుగా వచ్చే వరద నీటి కాలువకు అవుట్ లెట్ వ్యవస్థ లేకపోవడంతో కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరై చాలా కాలం అవుతున్న కాలువ నిర్మాణంలో ప్రైవేట్ ల్యాండ్ ఉండడంతో కాలువ నిర్మాణానికి వారు నిరాకరిస్తున్నారని డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, కాలనీ వాసులతో కలసి హై కోర్ట్ కాలనీలో సమావేశం నిర్వహించి కాలువ నిర్మాణం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పావని, డిఇ దామోదర్‌రావు, ఎఇ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, తూర్పు కాలనీ అధ్యక్షులు దీపావళి శ్రవణ్, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, సంక్షేమ సంఘం శ్రీనివాస్‌రెడ్డి, మురళి, దామోదర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బిడిఎల్ కాలనీ అధ్యక్షులు మాధవరెడ్డి, శేఖర్‌రెడ్డి, నాగరాజు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురం ఆటోనగర్‌లో కొనసాగుతున్న ప్రఖ్యాత గ్రేట్ బాంబే సర్కస్

**వనస్థలిపురం, 30 మార్చి ప్రభాతవార్త :** గ్రేట్ బాంబే సర్కస్ వ్యవస్థాపకుడు దూరదృష్టితో కళాకారులను పోషించే విధంగా బాబురావ్ కదమ్ ప్రస్తుతం పాకిస్థాన్‌లో వున్న సింద్ ప్రావిన్స్‌లోని హైదరాబాద్‌లో 1920 సంవత్సరం లో ఈ ఐకానిక్ దృశ్యాన్ని స్థాపించారు. ఇది ఒక శతాబ్దికి పైగా ప్రేక్షకులను ఆకట్టుకునే వారసత్వానికి నాంది పలికింది. 1947లో శ్రీ కెయం.కున్హికన్నన్ వైట్‌వే సర్కస్, హింద్ లయన్ సర్కస్‌లను ఒక చోట చేర్చి సర్కస్ యొక్క కచేరీలను సునంపన్నంచేసి ప్రధాన వినోద దృశ్యంగా దాని స్థానాన్ని పటి ష్టం చేసారు. విషాదకరంగా 1953లో కున్సికన్నన్ మరణించిన తరువాత ఆయన మేనల్లుడు కె.యం. బాలగోపాల్ నాయకత్వం వహించారు. అతని సారధ్యంలో గ్రేట్ బాంబే సర్కస్‌గా అభివృద్ధి చెందుతు అన్ని వర్గాల ప్రజల ను అలరించింది. దాని స్థాపకుడు బాబురావ్ కదమ్ ప్రారంభించిన తర్వాత కెయం.కున్హికన్నన్‌ద్వారా అందించబడిన స్రేష్టత, ఆవిష్కరణలలాంటి అంకిత భావం, అభిరుచితో ముందుకు సాగుతుంది. ఎల్‌బినగర్ ఎమ్మెల్యే బి.సుధీర్ రెడ్డి చేతుల మీదుగా మార్చి 29న ఘనంగా ప్రారంభమైన గ్రేట్ బాంబే సర్కస్ వారు చేసే ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్ర ముగ్దులు అవుతున్నా రు. ఈ సర్కస్‌లో సముద్ర సింహాలు. గొరిల్లాలు, లామా, బ్లాక్ ప్యాంతర్, హిప్పోపాటమస్‌తో 26ఏనుగులు, 50 గుర్రాలు, 16 పులులు, వివిధ రకాల అన్యదేశ జంతువులను ప్రదర్శించి ఒక ప్రత్యేక విశిష్టతను కలిగి వుందన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు, మధ్యా హ్నం 4 గంటలకు, సాయంత్రం 7 గంటలకు మూడు షోలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

## బాలాపూర్ మహాదేవరజీ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు : ఛైర్మన్



ఆలయ ఛైర్మన్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీలను తెరుస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, మార్చి 30 ప్రభాతవార్త:** బాలాపూర్‌లోని చారిత్రక శ్రీ రామలింగే శ్వరస్వామి (మహాదేవరజీ) ఆలయహుండీ ఆదాయం రూ.26,171 వచ్చింది. సోమవారం ఉదయం ఆలయ కమిటీ ఛైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి, డైరెక్టర్లు ఇక్కె మాధవి శ్రీనివాస్ కురుమ, కొలను శ్రీనివాస్‌రెడ్డి, పగుడాల ఉమేష్, ఆలయపూజారి దుర్గా ప్రసాద్‌లు దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఆలయ ఇఓ శ్రీనివాసరావుల సమక్షంలో హుండీలు తెరిచారు. ఈ సందర్భంగా తేది 2-3-2023 నుండి 30-3-2024 వరకు హుండీల్లో భక్తులు వేసిన డబ్బులను లెక్కించారు. ఈ నేపథ్యంలో దాదాపు సంవత్సరానికి పైగా ఆలయ హుండీల ఆదాయం రూ.26,171 వచ్చింది. అదే విధంగా హుండీ లో అజ్ఞాత భక్తులు వేసిన రెండు బంగారు చెవి రింగులను గుర్తించారు. (సుమారు 2 గ్రాముల వరకు ఉండొచ్చు). అయితే హుండీ ద్వారా వచ్చిన డబ్బులను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉన్న ఖాతాకు ఆలయ ఇఓ జమ చేశారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి బాలాపూర్‌కు చెందిన బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, కళ్లెం విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## ఈస్టర్ వేడుకలను పురస్కరించుకుని రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం



రన్ ఫర్ జీసెస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మైనంపల్లి తదితరులు

**మల్కాజిగిరి, మార్చి 30 ప్రభాతవార్త :** ఈస్టర్‌ను పురస్కరించుకుని శనివారం రన్ పర్ జీసస్ పేరుతో నేరేడ్‌మెట్ నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమతాల సారం ఒక్కటేనని అందరం సమానమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందన్నారు. క్రిస్టి యన్ మైనార్టీల సమస్యను పరిష్కరించే విధంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ సుధీర్, కె.అరుణ్‌కుమార్, చంటి బాబు, ఫాస్టర్ జోసెఫ్, దేవిడ్, శ్యాముల్, శ్రవణ్, జాయ్, జార్జ్ స్టెవెన్, సాల్మాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అభయ ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన షెడ్ ప్రారంభించిన కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్



షెడ్‌ను ప్రారంభిస్తున్న రవాణా శాఖ కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

**తుర్కయాంజాల్, మార్చి 30 ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం ఆర్టీవో కార్యాల యంలో ప్రజల సౌకర్యార్థం కోసం అభయ ఫౌండేషన్ తదితరుల సహకారం తో నిర్మాణం చేసిన షెడ్‌ను ప్రారంభానికి ముఖ్యఅతిథిగా శనివారం ఉప రవాణా శాఖ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఆర్టీఏ వి.సుభాష్‌చంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్ర శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం రవాణా శాఖ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యార్థం సుమారు 400 మంది కూర్చునే విధంగా అభయ ఫౌండేషన్ సహకారంతో షెడ్ నిర్మాణం చేపట్టినట్లు ప్రజలు తాగడానికి మంచినీళ్ల సౌకర్యం కల్పించారని ఆయన పేర్కొన్నారు. అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీద ప్రజలకు, నిరుద్యోగులకు డ్రైవింగ్, కుట్టు మిష న్లు, బ్యూటిషన్ తదితర సేవలను కల్పిస్తున్నందుకు అభినందనీయమన్నారు. ఆర్టీఓ కార్యాలయంలో షెడ్ నిర్మించినందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అభయ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీరామచంద్రమూర్తి, ఎంవిఐ శ్రీనివాస్‌రెడ్డి, షేక్ ముని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర పట్టణ మౌలిక వసతుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డిని కొంతం యాదిరెడ్డి, దుగ్గాని శ్యామల, అందేకార్ బాబూలాల్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం. (ప్రభాతవార్త, తుర్కయాంజాల్)

## నేడు ఎల్‌బినగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం : మల్‌రెడ్డి రాంరెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 30 ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు కర్మన్‌ఘట్‌లోని కొత్త కాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రోడ్డు రహదారుల అభి వృద్ధి ఛైర్మన్ ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొ న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కిగౌడ్, మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్చార్జి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీఅభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి, పార్లమెంట్ పరిధిలోని 7 నియో జకవర్గాల పార్టీ ఇన్చార్జిలు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని బూత్ కమిటీల ప్రతినిధులు, డివిజన్, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ఉప్పల్ చౌరస్తాలో బాల అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన



శ్రీ బాల అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 30 ప్రభాతవార్త :** ఉప్పల్ చౌరస్తాలో శ్రీ బాల అంజనేయ రామలింగేశ్వర స్వామి గణపతి ప్రత్యేక శనైశ్చర ధ్వజ ప్రతిష్ట మహోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ జగద్గురువులు ఆది శంకరా చార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వర్వులు శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ బాల అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాలు శాంతి యుతంగా చేసుకోవాలని, ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మాముదాల పాండురంగ శర్మ, బ్రహ్మశ్రీ డా.మాముదాల శ్రీకాంత్‌శర్మ పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.

## పార్టి గెలుపు కోసం అందరు పని చేయాలి : ఎంపి అభ్యర్థి దానం నాగేందర్



దానంతో మాట్లాడుతున్న సీనియర్ నాయకులు శైలెందర్ తధితరులు

**తార్నాక, మార్చి 30 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేం దర్‌ను తార్నాక డివిజన్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా అభ్యర్థిని దానంతో డివిజన్ మాజీ ఉపాధ్య క్షులు శైలెందర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ తన గెలుపుకోసం అందరు కలిసికట్టుగా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను నాయకులు, కార్యకర్తలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేఖర్ గౌడ్, అన్వర్, బాబి, కిషోర్ తధితరులు పాల్గొన్నారు.

## అస్తి పన్నులు సకాలంలో చెల్లించకపోతే ఆస్తులు జప్తు : డిసి అంజనేయులు



అస్తి పన్నులు చెల్లించని దుకాణాలను సీజ్ చేయిస్తున్న డిసి అంజనేయులు

**ఉప్పల్, మార్చి 30 ప్రభాతవార్త :** ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించని వారి ఆస్తులు జప్తు చేస్తామని ఉప్పల్ డిప్యూటి కమిషనర్ అంజనేయులు పేర్కొ న్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ ప్రధాన రహదారిలో అస్తి పన్నులు చెల్లించని మూడు దుకాణాలను సీజ్ చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిసి అంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ చేసిందని, పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. చాలా కాలంగా ఆస్తి పన్నులు చెల్లించకుండా ఉన్న దుకాణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈనెల 31వ తేదిలోగా ఆస్తి పన్నులు చెల్లించాలని ఆయన సూచించారు

## ఉప్పల్‌లో అస్తి పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్



దుకాణదారుల నుంచి ఆస్తిపన్నులు స్వీకరిస్తున్న డిసి అంజనేయులు, సిబ్బంది

**ఉప్పల్, మార్చి 30 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లో ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు డిసి అంజనేయులు తెలిపారు. ఈ మేరకు గురువా రం ఉప్పల్‌లో పలు దుకాణాలను సీజ్ చేయడంతోపాటు, పలువురు దుకాణ దారుల నుంచి ఆస్తి పన్ను వసూలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్నుపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసిందని, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు దుకాణదారులు పన్నులు చెల్లించారు. ఈ కార్యక్రమం లో పలువురు మున్సిపల్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో బిజెపి జెండా ఎగర వేయాలి : ఈటల రాజేందర్




సమావేశంలో ప్రసగిస్తున్న ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ తదితరులు

**ఉప్పల్, మార్చి 30 ప్రభాతవార్త :** మల్కాజిగిరిలో బిజెపి జెండా ఎగురవేయ డం ఖాయమని మల్కాజిగిరి బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొ న్నారు. ఈ మేరకు శనివారం రామంతాపూర్ లింగారెడ్డి గార్డెన్‌లో బిజెపి బూత్ కమిటి నేతల సమావేశంలో ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్‌తోపాటు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారత దేశానికి ఎంతో గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని మోడీకే దక్కుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు మోడీ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో 400 సీట్లు తక్కువ కాకుండా గెలిచి చూపించాలని కోరారు. బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి వివ రించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ కారుడిగా కరోనా కష్ట కాలంలో ఎంతో కష్టపడి ప్రజల కోసం పనిచేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీ ఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసిన మోడీ మాటే వినిస్తుందన్నారు. మల్కాజిగిరిలో బిజెపి జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బిఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు జి.మధుసూధన్‌రెడ్డి, ఆర్.కె.శ్రీని వాస్, ఎంపాల పద్మరెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, బిజెపి నేతలు ఎం.సతీష్‌కుమార్, రవినాయక్, గొరిగె కృష్ణ, పలువురు బిజెపి సీనియర్ నాయకులు, బూత్ కమిటి నేతలు పాల్గొన్నారు.

## మత సామరాస్యానికి ప్రతీక రంజాన్ ఇఫ్తార్ వేడుకలు : ఎం.పరమేశ్వర్‌రెడ్డి



రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందులో పాల్గొన్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 30 ప్రభాతవార్త :** రంజాన్ వేడుకలు మత సామరాస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పాత ఉప్పల్‌లో కుతుబ్‌షాహీ మసీదులో మసీదు కమిటి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా జరిగిన కార్యక్రమంలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ సంద ర్భంగా కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఇఫ్తార్ వేడుకలు జరుపుకో వడం అభినందనీయమన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు అనందోత్సవాలతో వేడుకలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటినేతలు అజ్జు, అస్లాం, ఖాజా, అల్లాబాషా, మౌలాలి, అష్రాఫ్, మహుముద్, ఖాసీం, అఫ్జల్, అన్వర్, అసిప్, తైసీన్, వహీద్, మౌలానా, ఇబ్రహం పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## సందడిగా తార్నాక ఇంటెల్లి టోట్స్ ప్రి స్కూల్ వార్షికోత్సవ వేడుకలు



తల్లిదండ్రులతో ఇంటెల్లి టోట్స్ ప్రీ స్కూల్ చిన్నారులు

**తార్నాక, మార్చి 30 ప్రభాతవార్త:** తార్నాకలోని ఫస్ట్ క్రై ఇంటెల్లి టోట్స్ ప్రీస్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో సందడిగా సాగాయి. చిన్నారులు చేసిన నృత్యాలు తల్లి, తండ్రులను అబ్బుర పరిచాయి. ఈ సందర్భంగా తల్లితండ్రులు బుడతలని చప్పట్లతో ఉత్తేజపరిచారు. చిన్నారులు చేపట్టిన వివిధ ప్రదర్శలు ఆకట్టుకున్నాయి. డ్యాన్స్, గ్లామర్‌వాక్, సూపర్ హీరో, ఫ్యాన్సీ డ్రెస్ వంటి ఈవెంట్స్‌లో చిన్నా రులు సత్తాచాటారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ప్రక్రితి శర్మ మాట్లాడు తూ పిల్లలకు చదువు భారం కాకుండా ఇష్టపడి చదివేలా ఆసక్తి కల్పిస్తున్నామ ని పేర్కొన్నారు. పిల్లలకు వివిధ రకాల గేమ్స్ ఆడిస్తూనే ఆహ్లాదకర వాతావ రణంలో పిల్లలకు విద్యనందిస్తున్నామని చెప్పారు. ఇలాంటి వేడుకలను పిల్లలు ఎంతో ఇష్టపడుతారని డైరెక్టర్ పేర్కొన్నారు. చిన్నారుల కోసం సమ్మర్ క్యాంపును కూడా నిర్వహిస్తున్నామని ప్రక్రితి శర్మ చెప్పారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి



పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

**ఎల్.బి.నగర్, మార్చి 30 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి రోజు రాత్రి 11:30 నుండి ఉదయము 3:30గంటల వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందొబస్తు నిర్వహిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. సరూర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాజీవ్ చౌక్, శ్రీనగర్‌కాలనీ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లైన్, విఎం హోమ్, పిఅండ్‌పి కాలనీ హాస్టాల్స్ ఉన్న ప్రాంతాలలో పెట్రోల్ మొబైల్స్, బ్ల్యూ కోట్స్, స్పెషల్ టీమ్స్‌తో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ఇవిటీసింగ్, చట్ట వేతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, యువత హాస్ట ల్స్ నుండి రాత్రి పూట బయటకి వచ్చి ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.